# గద్దర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతి




తెల్లాపూర్‌లో చకచకా జరుగుతున్న గద్దర్ విగ్రహ ఆవిష్కరణ ఏర్పాటు పనులు

రామచంద్రాపురం, జనవరి 30: తెల్లాపూర్‌లో ప్రజా యుద్ధనౌక గద్దర్ విగ్రహం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇటీవల తెల్లాపూర్‌లో కార్మిక నాయకులు కొల్లూరి సత్తయ్య, కౌన్సిలర్ భరత్‌కుమార్, గ్రామస్తులందరూ కలిసి 'గద్దర్ గళం' అంటూ నామకరణ చేసి గద్దర్ విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్న క్రమంలో ఆ స్థలం హెచ్ఎండీఏ పరిధిలోనిది కావడంతో అనుమతులు లేవంటూ అధికారులు పనులను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో కౌన్సిలర్ భరత్‌కుమార్ ఆమరణ దీక్షకు కూర్చున్నాడు. ఈ దీక్షకు మేధావులు, వివిధ సంఘాలు మద్దతు తెలపడంతో ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి గద్దర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. గద్దర్ జయంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు హెచ్ఎండీఏ అధికారులు విగ్రహ ఏర్పాటుకు 1076గజాల స్థలాన్ని మంజూరు చేస్తు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే విగ్రహ ఏర్పాట్ల పనులు చకచకా జరుగుతున్నాయి. గద్దర్ జయంతి సందర్భంగా బుధవారం సాయంత్రం తెల్లాపూర్‌లో జరుగనున్న విగ్రహ ఆవిష్కరణకు ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.

# విధులు నిర్వహిస్తూ కార్మికుడు మృతి

**పరిశ్రమ ఎదుట మృతదేహంతో గ్రామస్తుల ఆందోళన**



ఆందోళన విరమించాలని కోరుతున్న పోలీసులు, (ఇన్‌సెట్‌లో నర్సింహులు(ఫైల్))

హత్నూర, జనవరి 30: విధులు నిర్వహిస్తూ కాంట్రాక్టు కార్మికుడు మృతిచెందిన ఘటన హత్నూర మండలం బోర్పట్ల శివారులోని ఏపిటోరియా యూనిట్-1పరిశ్రమలో మంగళవారం చోటుచేసుకుంది. బోర్పట్ల గ్రామానికి చెందిన కొప్పు నర్సింహులు(32) పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడుగా పనిచేస్తున్నాడు. మంగళవారం పరిశ్రమలో విధులకెళ్లిన నర్సింహులు ఒక్కసారిగా కుప్పకూలి అక్కడికక్కడే మృతిచెందినట్లు తోటికార్మికులు తెలిపారు. పరిశ్రమ ప్రతినిధులు మృతుడి కుటుంబీకులకు తెలియకుండా చికిత్సపేరుతో సంగారెడ్డి శివారులోని ఎంఎన్ఆర్ దవాఖానకు తరలించడంతో విషయం తెలుసుకున్న కుటుంబీకులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో దవాఖానకు చేరుకొని అక్కడనుంచి మృతదేహంతో పరిశ్రమ ఎదుట ఆందోళన చేపట్టారు. కార్మికుడు పరిశ్రమలోనే మృతి చెందినప్పటికీ చికిత్సకోసం దవాఖానకు ఎలా తరలిస్తారని యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించేవరకు ఆందోళన విరమించేదిలేదని హెచ్చరించడంతో విషయం తెలుసుకున్న జిన్నారం సీఐ వేణుకుమార్, హత్నూర ఎస్ఐ సుభాష్ అక్కడికి చేరుకున్నారు. పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని, ఆందోళన విరమించాలని నచ్చజెప్పారు.

# కేసీఆర్ ప్రభుత్వంలో గణనీయమైన అభివృద్ధి

**పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి**



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

అమీన్‌పూర్, జనవరి 30: కేసీఆర్ ప్రభుత్వంలో రాష్ట్రం గణనీయమైన అభివృద్ధి సాధించిందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అమీన్‌పూర్ మండలపరిధిలోని కిష్టారెడ్డిపేట్, పటేల్‌గూడ, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ మండలపరిధిలో సుమారు రూ.5.72 కోట్లలతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించామన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధిపర్చి అదర్శంగా తీర్చిదిద్దానన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలు ఎప్పటికీ మరువలేరన్నారు. రానున్నకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ప్రభుత్వానికి తేడాను ప్రజలు గమనిస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మళ్లీ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్నే బలపర్చుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవానంద్, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు కృష్ణ, భాస్కర్‌గౌడ్, నీతి షాశ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరు తహసీల్ కార్యాలయంలో తనిఖీలు

- రికార్డులను పరిశీలించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి
- ఎన్నికల నిర్వహణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

పటాన్‌చెరు, జనవరి 30: పటాన్‌చెరు తహసీల్ కార్యాలయాన్ని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తనిఖీ చేశారు. మంగళవారం సాయంత్రం పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ రికార్డు రూమ్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. పటాన్‌చెరు తహసీల్దార్ భాస్కర్ వద్ద రికార్డుల నిర్వహణపై వివరాలు తీసుకున్నారు. పలు రకాల ప్రశ్నలు అడిగారు. తహసీల్దార్ కలెక్టర్‌కు రికార్డుల నిర్వహణపై సమాధానం ఇచ్చారు. దీంతో కలెక్టర్ సంతృప్తి చెందారు. ధరణి కార్యాలయంలోకి వెళ్లి అక్కడి కంప్యూటర్, రికార్డులను చూశారు. ధరణి నమోదుపై పలు సందేశాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్లను స్వయంగా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడారు. అర్హులందరూ ఓటరు జాబితాలో ఉండాలని సూచించారు. స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీల సహకారం కావాలని కోరారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతమైందన్నారు. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా వెలువడుతుందన్నారు. ప్రతివారం పొలిటికల్ పార్టీలతో అధికారులు సమావేశం అవుతున్నారా.? అని అడిగి తెలుసుకున్నారు. బీఎల్‌వోల విషయంతో క్షేత్రస్థాయిలో సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. చనిపోయినవారిని, డూప్లికెట్ ఓటర్లను తొలిగిస్తామన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ లక్డారం క్రషర్లపై టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామని, వారిచ్చిన రిపోర్టుపై చర్యలుంటాయన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి దేవుజా, తహసీల్దార్ భాస్కర్, డిప్యుటీ తహసీల్దార్లు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.



వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన కలెక్టర్ వల్లూరు క్రాంతి

# విద్యుత్ సమస్యతో కాలిపోతున్న మోటర్లు



కాలిపోయిన బోరుమోటరు

హత్నూర, జనవరి 30: హత్నూర మండలం సాదుల్లానగర్‌లో కొన్నిరోజులుగా విద్యుత్ సమస్యతో బోరుమోటర్లు కాలిపోతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరాలోపంతో బోరుమోటర్లు కాలిపోయి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వేసిన పంటలు కూడా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్య పరిష్కరించాలని పలుమార్లు విద్యుత్ అధికారులను కోరినప్పటికీ పట్టించుకోకపోవడంతోపాటు నిర్లక్ష్యంగా సమాధానం చెపుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

# రోడ్డు ప్రమాదంలో జింక మృతి



జింకకు పోస్ట్‌మార్టం చేస్తున్న వైద్యురాలు

గుమ్మడిదల, జనవరి 30: రోడ్డు ప్రమాదంలో జింక మృతి చెందిన ఘటన గుమ్మడిదల మండలంలోని మంభాపూర్ అటవీ ప్రాంతంలోని జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. మండల ఫారెస్ట్ సెక్షన్ అధికారి మంజిత్ సింగ్ కథనం ప్రకారం...మండలంలోని మంభాపూర్ అటవీప్రాంతంలో నాలుగేండ్ల వయస్సు ఉన్న జింక రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా ఆడ జింక రోడ్డుపై కళేబరాన్ని గుర్తించామని తెలిపారు. జిల్లా అటవీశాఖ అధికారుల సూచన మేరకు గుమ్మడిదల పశుసంవర్ధక శాఖ వైద్యులతో పోస్ట్‌మార్టం నిర్వహించినట్లు తెలిపారు. అటవీ ప్రాంతంలో వాహనాలు నెమ్మదిగా వెళ్లాలని కోరారు.

# వెదజల్లే పద్ధతిలో అధిక దిగుబడులు

గుమ్మడిదల, జనవరి 30: వెదజల్లే పద్ధతితో సాగుచేయడం వల్ల రైతులకు ఖర్చులు తగ్గి దిగుబడి పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిగూడెం, కొత్తపల్లి, నల్లవల్లి గ్రామాల్లో రైతులు వంద ఎకరాల్లో వరిని వెదజల్లే పద్ధతిలో సాగు చేశారని తెలిపారు. మంగళవారం క్షేత్రస్థాయిలో వరి పంటలను పరిశీలించారు. వెదజల్లే పద్ధతిలో వరిని సాగు చేయడతో కలుపు మందులు తప్పనిసరిగా వాడాలన్నారు. ఈ యాసంగిలో మండలంలో ఐదువేల ఎకరాల సాగుకు, కేవలం 850 ఎకరాలు మాత్రమే ఇప్పటి వరకు రైతులు వరిని సాగు చేశారని తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనలో ఏఈవో ఆస్మిత, రైతులు ఉన్నారు.

# అధిక సాంద్రత పద్ధతితో లాభాలు

వట్‌పల్లి, జనవరి 30 : అధిక సాంద్రత పద్ధతితో వ్యవసాయం చేస్తే ఎన్నో లాభాలు వస్తాయని రాజేంద్రనగర్ రావెఫ్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు తెలియజేశారు. మండలకేంద్రంలోని రైతుకేంద్రంలో మంగళవారం అధిక సాంద్రత వ్యవసాయ పద్ధతిపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మహేశ్‌చౌహన్ మాట్లాడుతూ..రైతులకు అధిక సాంద్రత పద్ధతిలో వ్యవసాయం ఎలా చేయాలో వివరించారు. అధిక సాంద్రత పద్ధతి నమూనను ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ హుస్సేన్, ప్రొఫెసర్ అమీర్ భాషా, ఏడీఏ శివకుమార్, ఏవోలు, రైతులు పాల్గొన్నారు.

## చెరుకు రైతులను ఆదుకుంటాం

న్యాల్‌కల్, జనవరి 30: చెరుకు సాగు చేసే రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటామని గోదావరి ఆగ్రో ప్రొడక్షన్ మాటూర్ చక్కెర ఫ్యాక్టరీ మేనేజర్ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వడ్డి, గుంజోట్టి గ్రామాల్లో రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరంలోనే ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ చేపట్టనున్నమన్నారు. క్రషింగ్‌కు చెరుకును తరలించే రైతులకు ఫ్యాక్టరీపరంగా లెబర్, ఆర్‌వెస్టింగ్ సమకూర్చుతామన్నారు. కొత్తగా చెరుకు ప్లాంటేషన్ చేసే రైతులకు ఎకరాలకు రూ.7వేల రుణాన్ని ఇప్పించాడమే కాకుండా కొత్త వంగడాల చెరుకు మొక్కలను సరఫరా చేస్తామని పేర్కొన్నారు. రైతులకు సోలర్ కిట్లను అందజేస్తామని తెలియజేశారు. సమావేశంలో చెరుకు ప్రధాన శాస్త్రవేత్త డా.విజయ్ కుమాన్, ఫిల్డ్ ఆఫీసర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, అరుణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

## రేపు సిర్గాపూర్ పంచాయతీ భవనం ప్రారంభం



సిర్గాపూర్, జనవరి 30: మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభానికి సిద్ధమైంది. ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.20 లక్షలతో మండల వనరుల కేంద్రం సమీపంలో నిర్మించారు. గురువారం కలెక్టర్ వల్లూరు క్రాంతి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి ప్రారంభిస్తారని స్థానిక సర్పంచ్ జంగం స్వప్నాశంకరయ్యస్వామి మంగళవారం తెలిపారు. ఈమేరకు శిలాఫలకం ఏర్పాట్ల పనులు చేపడుతున్నారు.

## నేడు గుమ్మడిదలకు ఎమ్మెల్యే రాక

గుమ్మడిదల, జనవరి 30 : పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పలు అభివృద్ధి పనులను ప్రారంభించడానికి బుధవారం గుమ్మడిదలకు రానున్నారాని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహ్మద్ హుస్సేన్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.45 గం టలకు గుమ్మడిదలకు, 8.15 గంటలకు బొంతపల్లి, 8.40కి వీరన్నగూడెంలో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమానికి ఎంపీపీ, జడ్పీటీసీ, మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

# లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి




మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కంగ్టి, జనవరి 30: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీని గెలిపించాలని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక రామాలయంలో కంగ్టి మండల బీజేపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఎవరైనప్పటికీ దేశంలో మరోమారు నరేంద్రమోదీని ప్రధానమంత్రిగా గెలిపించుకోవాలని సూచించారు. ఎన్నికలకు డెబ్బైరోజుల సమయం ఉందని, ప్రతిరోజూ కార్యకర్తలు ప్రజలతో మమేకం కావాలని సూచించారు. ప్రజా సమస్యలను గుర్తించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. 500 ఏండ్లుగా కలగానే ఉన్న అయోధ్య రామమందిర నిర్మాణం ప్రధాని నరేంద్రమోదీతోనే సాధ్యమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ఎక్కువ స్థానాలు గెలుపొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బద్దం మహిపాల్‌రెడ్డి, జనవాడ సంగప్ప, రవికుమార్, రజనీకాంత్, మహాదేవ్, దత్తాత్రేయ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించాలి

**ఎమ్మెల్యే కౌసర్ మొహియొద్దీన్**


కోహీర్, జనవరి 30: టెన్త్ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియొద్దీన్ పిలుపునిచ్చారు. మంగళవారం కోహీర్ పట్టణంలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాల, దిగ్వాల్ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు ఎంఐఎం ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు తాము అందించిన స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



దిగ్వాల్‌లో విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియొద్దీన్

# మహాత్ముడి ఆశయ సాధనకు కృషి చేయాలి

బొల్లారం/జిన్నారం/సంగారెడ్డి/ గుమ్మడిదల/ నాగల్‌గిద్ద, జనవరి 30: మహాత్మాగాంధీ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ రోజా బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం గాంధీ వర్ధంతి సందర్భంగా పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిన్నారంలోని మండల పరిషత్ కార్యాలయంలో మహాత్ముడి విగ్రహానికి ఎంపీపీ రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో గాంధీజీ విగ్రహానికి ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. గుమ్మడిదలలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నక్క వెంకటేశం గౌడ్ మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాగల్‌గిద్ద మండలంలోని మోర్గి మోడల్ పాఠశాలలో మహాత్ముడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



భారతీనగర్‌లో మహాత్ముడికి నివాళులర్పించిన కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి, నాయకులు

## ఎస్సీ రైతులకు బోరు సదుపాయం

సిర్గాపూర్ జనవరి 30: ఎస్సీ, ప్రత్యేకాభివృద్ధి పథకం కింద సామూహిక బోరు సదుపాయం కల్పించేందుకు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ గౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్‌కు ఎస్సీ చిన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సుజాత తెలిపారు. మంగళవారం స్థానిక ఆఫీసులో ఆమె మాట్లాడుతూ రెండు ఎకరాల్లోపు, అసైన్డ్ లేదా పట్టా భూమి ఉన్న రైతులు, ఇద్దరు లేదా ఐదుగురు కలిపి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎస్సీ రైతు ఫొటో, పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డు, కులం ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు ప్రతులను దరఖాస్తు పత్రానికి జత చేసి రెండు రోజుల్లో దరఖాస్తులను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని ఎస్సీ రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం, జనవరి 30: ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇండ్ల నిర్మాణాలు చేపట్టడంతో రెవెన్యూ అధికారులు జేసీబీతో కూల్చివేయించారు. మంగళవారం మండలంలోని ఖాజిపల్లిలోని 181 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో కొంతమంది అక్రమార్కులు అక్రమంగా ఇండ్ల నిర్మాణాలు చేపట్టారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్‌నారాయణ అక్రమ నిర్మాణాలను కూల్చివేయించారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## ప్రశాంతంగా పరీక్షలు రాయాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీవో పాండు

అందోల్, జనవరి 30: ఇంటర్, టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అందోల్-జోగిపేట ఆర్డీవో పాండు సూచించారు. మంగళవారం మండలంలోని గురుకుల పాఠశాలలు, కళాశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఆలోచనలు పెట్టుకోకుండా పూర్తి సమయం చదువుపైనే పెట్టాలన్నారు. కష్టపడి చదివితే జీవితంలో ఉన్నతశిఖరాలకు చేరుకోవచ్చని, చదువును ఏ మాత్రం నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న వసతులను పరిశీలించి వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంటోనీ, సీఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


# కుష్టు నివారణకు పటిష్ట చర్యలు



అవగాహన కల్పిస్తున్న జాతీయ పొగాకు నియంత్రణ పర్యవేక్షకుడు విష్ణువర్ధన్‌రెడ్డి

చౌటకూర్, జనవరి 30: మండలంలోని శివంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుష్టువ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని జాతీయ పొగాకు నియంత్రణ పర్యవేక్షకుడు విష్ణువర్ధన్‌రెడ్డి పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంగళవారం నుంచి ఫిబ్రవరి 13 వరకు జిల్లాలో ప్రతి గ్రామంలో కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 109మంది కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించామన్నారు. 80మంది చికిత్స పొందారని, మరో 39 మంది చికిత్స పొందుతున్నారని తెలియజేశారు. చర్మంపై తెల్లని, ఎర్రని, రాగి వర్ణం కలిగిన మచ్చలు స్పర్శజ్ఞానాన్ని కోల్పోయి, నరాల్లో నొప్పి, వాపు కలిగి ఉండటాన్ని ప్రధాన లక్షణాలుగా గుర్తించాలన్నారు. ఇలాంటి లక్షణాలున్న వారు పీహెచ్‌సీ, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు పొందాలన్నారు. అనంతరం విద్యార్థులతో కుష్టు నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, ఉపాధ్యాయులు రాములు, ఖదీర్, మజీద్ పాల్గొన్నారు.

# బీరయ్యయాదవ్‌కు నాయీబ్రాహ్మణుల సంఘీభావం



బీరయ్య యాదవ్‌కు సంఘీభావం తెలుపుతున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

సంగారెడ్డి, జనవరి 30: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్న సీనియర్ నాయకుడు, బీసీసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్‌కు నాయీబ్రాహ్మణుల సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. మంగళవారం పట్టణంలో నాయీబ్రాహ్మణుల నూతన కార్యవర్గం సమావేశం నిర్వహించి బీరయ్యయాదవ్‌కు మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు మామిళ్ల నాగభూషణం మాట్లాడుతూ జిల్లాలో నాయీబ్రాహ్మణ సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి రాజారాం, కార్యదర్శులు రవి, విష్ణువర్ధన్, కోశాధికారి సత్తయ్య, వీరన్న కృష్ణ, మురళి, దత్తు, నర్సింహులు, గంగారాం, రమేశ్‌తోపాటు మండల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

## టాస్క్‌ఫోర్స్ దాడులు

సంగారెడ్డి, జనవరి 30: అక్రమంగా సిగరెట్ల వ్యాపారం చేస్తున్నారన్న పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి 236 సిగరెట్ ప్యాకెట్లను సీజ్ చేశారు. మంగళవారం జహీరాబాద్ పట్టణం శాంతినగర్ కాలనీకి చెందిన మహ్మద్ ఖదీర్ (28) తన కిరాణ దుకాణంలో అనుమతి లేకుండా నిషేధిత సిగరెట్లను విక్రయిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి అక్రమంగా అమ్ముతున్న సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని షాపును సీజ్ చేశారు. మహ్మద్ ఖదీర్‌ను అదుపులోకి తీసుకొని, 236 సిగరెట్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు.



టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న సిగరెట్ బాక్సులు

## హుండీ లెక్కింపు

కోహీర్, జనవరి 30: మండలంలోని బడంపేట రాచన్నస్వామి ఆలయ హుండీని లెక్కించామని ఆలయ కార్యనిర్వహణాధికారి శివరుద్రప్ప తెలిపారు. మంగళవారం జిల్లా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో హుండీని లెక్కించగా రూ.3.35లక్షల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శివలింగానికి అభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, మహమంగళహారతి, అన్నపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శివరుద్రప్ప, జగదీశ్వర్‌స్వామి, శివానంద్, చెన్నవీరయ్య స్వామి, భుజంగం, రాజన్న, రాచయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు జగద్గురు శంకర విజయేంద్రమహాస్వామి రాక

న్యాల్‌కల్, జనవరి 30: మండలంలోని రేజింతల్ సిద్ధి వినాయక ఆలయానికి మొదటిసారిగా కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర మహాస్వామి రానున్నట్టు ఆలయ ట్రస్టు అధ్యక్షుడు అశోక్ రేజింతల్, ప్రధాన కార్యదర్శి అల్లాడి నర్సింహులు తెలిపారు. స్వామివారి విజయయాత్రలో భాగంగా 31న సాయంత్రం జహీరాబాద్ పట్టణం నుంచి ప్రత్యేక రథంలో వేద పండితుల మంత్రోచ్చారణలు, 51 పూర్ణకుంభ కులశాలు, భజన కీర్తనల మధ్య ఊరేగింపుతో ఆలయానికి రానున్నారని తెలిపారు. రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు స్వామివారి దర్శనం, ఆశీర్వాద సందేశం, ఫిబ్రవరి 1న ఆలయంలో సిద్ధి వినాయక స్వామివారికి ప్రత్యేక పూజలు, ఆనంతరం విజయేంద్ర మహాస్వామివారి దర్శనం ఉంటుందన్నారు. అనంతరం జగద్గురు చంద్రమౌళీశ్వర స్వామివారి సంస్థాన పూజ, మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 వరకు స్వామివారి ఫలమంత్రాక్షత, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## మెరుగైన సేవలకు డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్, జనవరి 30: ఆర్టీసీ సేవలను మరింత మెరుగైన రీతిలో కొనసాగించేందుకే డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లేశయ్య తెలిపారు. మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించి ఆర్టీసీ సేవలపై ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు డీఎంను ఫోన్‌లో సంప్రదించి పలు రూట్లలో బస్సులు నడపాలని సూచించారు. ప్రజల సూచనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆయా రూట్లలో బస్సులు కొనసాగించే విధంగా చూస్తామని డీఎం పేర్కొన్నారు.